ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే సర్వే చేపట్టాలి

● ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఎదులాపురం, సెప్టెంబర్ 28 : నీటి వనరుల సంరక్షణ కోసం చేపడుతున్న సర్వేలో పేద వారు ఇండ్లు కోల్పోతున్నారని, వారికి ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతనే సర్వే చేయాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఖానాపూర్ చెరువు సర్వే, రోడ్లు, మురుగు కాలువలు ఇతర సమస్యలపై సభ్యులు లెవనెత్తారు. వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని చైర్మన్‌తో పాటు కమిషనర్ ఖమర్ అహ్మద్ హామీ ఇచ్చారు. అనంతరం తీర్మానాలను

మాట్లాడుతున్న ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ నీటి వనరుల సంరక్షణలో భాగంగా ఖానాపూర్ చెరువు వద్ద చేపడుతున్న సర్వేతో అక్కడ నివాసముంటున్న ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. ఈ విషయమైన అన్ని పార్టీల కౌన్సిలర్లు కలెక్టర్‌ను కలిసి ముందు ప్రత్యామ్నాయం చూపిన తర్వానే సర్వే నిర్వహించాలని కోరుతామన్నారు. అదే విధంగా పట్టణంలోని సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేశామన్నారు. అందరి సహకారంతో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో డీఈ తిరుపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో వేయాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 28 : రైతు భరోసా డబ్బులు అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంకా రాఘవులు, బండి దత్తాత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలం చాందా(టీ) గ్రామంలో పార్టీ గ్రామ మహాసభలు నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి స్వామి, గంగన్న, నాయకులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ కృషి

ఎదులాపురం,సెప్టెంబర్ 28 : ఐటీఐ కళాశాలలో అధ్యాపకుల సమస్యలు పరిష్కరించేలా కలెక్టర్ హామీ ఇచ్చారని, తిరిగి వారిని విధుల్లోకి తీసుకున్నామని కళాశాల ఐఎంసీ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఆదిలాబాద్‌లోని ఐటీఐ కళాశాలలో ఐఎంసీ కమిటీ సమావేశం నిర్వహించారు. పలు విషయాలు విద్యార్థులకు తెలియజేశారు. వృత్తి నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిన్సిపాల్ రోడ్డ శ్రీనివాస్, ఐఎంసీ కమిటీ సభ్యులు పద్మ భూషణ్ రాజు, సీనియర్ సభ్యులు అమ్జద్ ఖాన్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జిల్లాల వారీగా చేయాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 28 : ఎస్సీ వర్గీకరణ జిల్లాల వారీగా చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. మాదిగల మేలుకొలుపు యాత్ర శనివారం ఆదిలాబాద్‌కు చేరుకుంది. బస్టాండ్ ఎదుట గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ నాయకులు మనోజ్, నక్క రాందాస్, సోమ చంద్రశేఖర్, సురేశ్, గణేశ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

తలమడుగు, సెప్టెంబర్ 28 : తలమడుగులోని రెండో అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం మండలాభివృద్ధి అధికారి శేఖర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం, బాలామృతం, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ఆయన వెంట అంగన్‌వాడీ టీచర్, ఆయా ఉన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

ఇచ్చోడ, సెప్టెంబర్ 28 : మండలంలోని గేర్జం యూపీఎస్, చించోలి ఎంపీపీఎస్, నావేగాం యూపీఎస్, నర్సాపూర్ జడ్పీహెచ్ఎస్, సిరిచెల్మ యూపీఎస్, మెడిగూడ ఏహెచ్ఎస్ పాఠశాలలో శనివారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆడె నూర్ సింగ్, ప్రధాన కార్యదర్శి నర్రవీన్ యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాశ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

జైనథ్, సెప్టెంబర్ 28 : లక్ష్మీపూర్ గ్రామంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో షీటీం సభ్యులు శనివారం విద్యార్థులకు షీటీం విధులు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం బృందం సభ్యురాలు సుశీల మాట్లాడుతూ సైబర్ నేరాలపై 1930 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పోరెడ్డి అశోక్, షీటీం సభ్యులు సత్యమోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

భీంపూర్, సెప్టెంబర్ 28 : రైతులు సహా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భీంపూర్ తహసీల్దార్ నలందప్రియ అన్నారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నలందప్రియను శనివారం బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ నాగయ్య, నాయకులు పాల్గొన్నారు.

B.Ed. (Admissions)
Few Management seats are available with affordable Fee at
Alexander B.Ed.College
Urdu, English, Telugu Medium in Mugdumpur, Karimnagar.
Cell: 86887 63015, 81794 85260

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

నేరడిగొండ, సెప్టెంబర్ 28 : విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శనివారం కుంటాల(కే) ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థినులు ఇటీవల జరిగిన ఆటల పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో వారిని ఎమ్మెల్యే అభినందించారు. గిరిజన విద్యార్థినులు బాగా చదవి ఐఏఎస్, ఐపీఎస్‌లు కావాలని సూచించారు. కేసీఆర్ హయాంలో జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి వేలమందిని డాక్టర్లుగా అయ్యే అవకాశాలు కల్పించారన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారిలో అండర్ -17 వాలీబాల్‌లో అనుష్క, జ్యోతి, కృష్ణవేణి, అండర్ -14 వాలీబాల్‌లో శ్రేయ, అంజలిదేవి, దీపిక. అండర్-14 కబడ్డీలో భీంబాయి, అర్షిక, స్వాతి ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, తిరుమల్‌గౌడ్,. దేవేందర్‌రెడ్డి, సయ్యద్ జహీర్, రాథోడ్ సురేందర్, సాయిరాం, అభిరాం, నానక్‌సింగ్, ప్రతాప్‌సింగ్, మాజీ సర్పంచ్ అశోక్, హెచ్ఎం అంబారావ్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బోథ్, సెప్టెంబర్ 28 : సొనాల గ్రామానికి చెందిన ఎందే రమణ కూతురు సహస్ర(14), కాంబ్లే రాము ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను శనివారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు సోలంకి రుక్మాణ్ సింగ్, స్వామి, ప్రశాంత్ ఉన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

తలమడుగు, సెప్టెంబర్ 28: విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్ అన్నారు. శనివారం చర్లపల్లి, ఝరి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉన్నారు.

భగత్ సింగ్ జయంతి

బోథ్: నివాళులర్పిస్తున్న యువకులు

నమస్తే నెట్‌వర్క్, సెప్టెంబర్ 28: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ జయంతిని శనివారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, యూత్ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

ఎదులాపురం,సెప్టెంబర్ 28 : ఉపాధ్యాయుల కొరతను అధిగమించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు ప్రక్రియ పేరుతో తీసుకువచ్చిన జీవోను విరమించుకోవాలని ఎస్‌టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజ్జంకి రవీంద్ర, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్ డిమాండ్ చేవారు. శనివారం ఆదిలాబాద్‌లోని తిర్పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు సంవత్సరాల తరబడి కోరుతా ఉంటే ప్రభుత్వం అశాస్త్రీయమైన రేషనలైజేషన్ ఉత్తర్వులు అమలు చేయాలని పిల్లల సంఖ్య పరంగా ఉపాధ్యాయులను నియమించాలని ఉత్తర్వులు ఇవ్వడం అసంబద్ధమని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ రాష్ట్ర నాయకులు పుప్పాల నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్, అర్బన్ మండల అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, పోచరెడ్డి, ఎస్టీయూ నాయకులు రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నిరసన చేపడుతున్న ఎస్‌టీయూటీఎస్ సంఘ సభ్యులు

అవకతవకలు పాల్పడితే కఠిన చర్యలు

ఇచ్చోడ, సెప్టెంబర్ 28 : ఇచ్చోడలోని రైతు వేదికలో ఉపాధి హామీ పథకంలో పనులపై శనివారం ప్రజావేదిక నిర్వహించారు. 14వ విడుత సామాజిక తనిఖీల్లో భాగంగా 2023-24 సంవత్సరంలో రూ.4.48 కోట్లతో చేపట్టిన 162 పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. అదనపు ఆర్డీవో కుటుంబ రావ్, ఏపీడీవో కృష్ణారావ్, ఎంపీడీవో లక్ష్మణ్ సమక్షంలో తనిఖీ గుర్తించి 32 గ్రామ పంచాయతీల లోపాలను తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఎంపీడీవో రాంప్రసాద్, ఇచ్చోడ ఏపీవో నరేందర్ గౌడ్, ఎస్ఆర్పీ తిరుపతి, డీఆర్పీలు చంద్రశేఖర్, శివ, సుధాకర్, టీఏలు, ఎఫ్ఏ, కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళా శాఖ నుంచి దివ్యాంగుల శాఖను వేరు చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 28 : రాష్ట్ర మహిళా సంక్షేమ శాఖ నుంచి దివ్యాంగుల సంక్షేమ శాఖను వేరు చేయాలని దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాక్‌పెల్లి సురేందర్ శనివారం నిర్మల్‌కు వచ్చిన రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావుకు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు ఇసాక్ అలీ, తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితాపై బీఎల్ వోలకు అవగాహన

బేల, సెప్టెంబర్ 28 : బేల మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ కొట్నాక్ రఘునాథ్‌రావ్ శనివారం బూత్ లెవెల్ అధికారులకు ఓటరు జాబితాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఉన్న కుటుంబ సభ్యులను ఒకే చోట చేర్పించాలని సూచించారు. దీనికి సంబంధించిన ఓటరు తుది జాబితాను సంబంధిత బీఎల్‌వోలకు అప్పగించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్ రావ్, కార్యాలయ సిబ్బంది,బీఎల్‌వోలు పాల్గొన్నారు

కుంటాల, సెప్టెంబర్ 28 : స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఇటీవల పంచాయతీ వార్డుల వారీగా సవరణలు చేయగా ఓటర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరణ అనంతరం శనివారం ఆయా గ్రామ పంచాయతీల్లో తుది ఓటరు జాబితాను విడుదల చేశామని ఎంపీడీవో లింబాద్రి తెలిపారు.

మహిళల భద్రత కోసం పటిష్ట చర్యలు

ఎదులాపురం, సెప్టెంబర్ 28 : మహిళల భద్రత కోసం పటిష్ట చర్యలు చేపడుతున్నామని మహిళా కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ నేరెళ్ల శారద పేర్కొన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని పెన్‌గంగ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నాలుగు రోజులుగా జిల్లా పర్యటనలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. పలు సమస్యలు తెలుసుకున్నామని తెలిపారు. పని ప్రదేశంలో వేధింపులకు గురైతే ఉన్న చట్టాలు కూడా మహిళలకు వివరించామన్నారు. సమస్యలపై మహిళలు, బాలికలు టోల్ ఫ్రీ నంబర్ 9490555533 సంప్రదించాలని సూచించారు. అలాగే ఆదిలాబాద్‌లోని సఖీ కేంద్రాన్ని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద తనిఖీ చేశారు. పలు రిజిస్టర్లను పరిశీలించి బాధితులకు అందిస్తున్న సేవలు, కేసుల వివరాలను కేంద్రం నిర్వాహకురాలు సరస్వతిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఫిర్యాదు కోసం టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ మెంబర్ ఈశ్వరీబాయి, కార్యదర్శి సుభద్ర, డీడబ్ల్యూవో సబిత, సిబ్బంది పాల్గొన్నారు.

రేణుకమాతను దర్శించుకున్న చైర్‌పర్సన్

తలమడుగు, సెప్టెంబర్ 28: మహారాష్ట్రలోని మహోర్‌లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రేణుకా మాత ఆలయాన్ని శనివారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద దర్శించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ పాల్గొన్నారు.

ధమ్మచక్ర యూత్ కమిటీ ఎన్నిక

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 28: ఇంద్రవెల్లిలోని మిలిందనగర్ త్రీరత్న బుద్ధవిహార్‌లో పూజ్య భంతే జీవక్ ఆధ్వర్యంలో ధమ్మచక్ర యూత్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాగ్మారే నవీన్, ఉపాధ్యక్షుడి మస్కే అన్విత్, ప్రధానకార్యదర్శిగా అరవింద్, కోశాధికారిగా వాగ్మారే శక్తి, సంయుక్త కార్యదర్శి కాంబ్లే రూతిక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ వారసులు, మిలిందనగర్ వాసులు పాల్గొన్నారు.

రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 28 : ఏకలవ్య ఫౌండేషన్ వాటర్ షేడ్‌ల ద్వారా గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఏకలవ్య ఫౌండేషన్, వాటర్ షేడ్ సంస్థ చైర్మన్ వెంకట్‌రావ్ అన్నారు. శనివారం వాల్గొండా గ్రామంలోని రైతు వేదికలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు సమ్మేళనం నిర్వహించారు. గ్రామ శివారులో చేపట్టిన పలు రకాల అభివృద్ధి పనులను రైతులతో కలిసి పరిశీలించారు. వాటి ఉపయోగం గురించి రైతులు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వాల్గొండా మాజీ సర్పంచ్ కినక జుగాదిరావ్, ఏకలవ్య వాటర్ షేడ్ సంస్థ ట్రస్టు సభ్యులు కినక లచ్చుపటేల్, దిగంబర్, మత్యం శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు పాటించాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 28 : జీవన విధానం, ఆరోగ్య అలవాట్లలో మార్పులు చేసుకుంటే దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించవచ్చని డీఎంహెచ్‌వో కృష్ణ సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా శనివారం ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయంలో సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. స్వయంగా డీఎంహెచ్‌వో కూడా ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్‌పల్లి వార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన , డిస్టిక్ లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ గజానంద్, ఎన్‌హెచ్ ఎం డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్, జిల్లా ఏపీడీమాలజిస్టు డాక్టర్ అశోక్ , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

ఎదులాపురం, సెప్టెంబర్ 28 : పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని వాల్మీకినగర్‌లో అమృత్ పథకంలో భాగంగా పది లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ట్యాంకు నిర్మాణం గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఏఈ అరుణ్ కుమార్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరుబాట పట్టాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 28 : విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరుబాట పట్టాల్సిన అవసరం ఉందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని యాదవ సంఘం భవన్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్ అధ్యక్షతన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా సమ సమాజ స్థాపనకై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని విస్మరిస్తున్నాయని, విద్యార్థులు ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని అన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీఎంబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు విడుదల చేసేంత వరకు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టి ,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావ్, పూర్వ జిల్లా నాయకులు విజ్జగిరి నారాయణ, మనోజ్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జగన్‌సింగ్, పీవోడబ్ల్యు జిల్లా కార్యదర్శి లక్ష్మి, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు రాణి, విజేత, పీవైఎల్ జిల్లా కార్యదర్శి వినోద్, విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ రాహుల్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలను జయప్రదం చేయండి

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 28 : నిర్మల్‌లోని తిరుమల గార్డెన్‌లో చుక్క ధర్మరాజ్ మెమోరియల్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహిస్తున్నామని టోర్నమెంట్ చీఫ్ జడ్జి రాపోలు సుదర్శన్ తెలిపారు. శనివారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాలు రానున్నాయని ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు జిల్లాకు వచ్చాయన్నారు. దాదాపు 1200 మంది క్రీడాకారులతో పోటీలు నిర్వహిస్తున్నామని 8 నుంచి 32 సంవత్సరాల వయస్సు గల క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ పోటీలను చైర్మన్ సీని నటుడు సుమన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్, ఎమెల్యే మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో తేజేందర్ సింగ్, కొండాజి శ్రీకాంత్, భూషణ్,స్వామి, సాయి కృష్ణ, మృణాళిని పాల్గొన్నారు.

హిందువుల ఐక్యతను చాటి చెప్పాలి

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 28 : హిందువుల ఐక్యతను చాటి చెప్పాలని విశ్వహిందూ పరిషత్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ విఠల్ అన్నారు. శనివారం నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల లడ్డూ కల్తీ చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 30వ తేదీన ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ ఇందూర్ విభాగ్ ధర్మచార్య సంపర్క్ ప్రముఖ్ పతికె రాజేందర్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి మూర్తి ప్రభాకర్, ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 28: నిర్మల్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వరల్డ్ విజన్ ఇండియా ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను కలెక్టర్ అభిలాష అభినవ్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్ విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్ రెడ్డి, ప్రోగ్రాం అధికారి బ్రహ్మన్న, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 28: మండలంలోని సిర్గాపూర్ ప్లేయర్ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులను ఎంఈవో శంకర్, పాఠశాల కరస్పాండెంట్, నర్సింహరెడ్డి పరిచయం చేసుకున్నారు. అనంతరం క్రీడల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

ఇచ్చోడ, సెప్టెంబర్ 28 : ఇచ్చోడ మండలం గుబ్బతండా గ్రామ శివారులో గంజాయి సాగు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. కోవ హనుమంతుకు చెందిన భూమిని అతనికి వరుసకు అల్లుడైన పెందూర్ మణిక్యరావ్ మూడు సంవత్సరాలుగా కౌలు తీసుకుంటున్నాడు. ఈ సీజన్‌లో పత్తి పంటలో అంతర పంటగా గంజాయి మొక్కలు సాగు చేస్తున్నాడని సమాచారం రాగా ఇచ్చోడ సీఐ భీమేశ్, ఎస్ఐ తిరుపతి, సిబ్బందితో కలిసి దాడి చేశారు. సుమారు 30 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.45 వేలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

స్వామివారి పాదాలను తాకిన సూర్యకిరణాలు

తలమడుగు, సెప్టెంబర్ 28: భరంపూర్ కొండపై స్వయంభుగా వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి పాదాలపై సూర్యకిరణాలు పడడం మహాద్భుతమని తహసీల్దార్ రాజమోహన్ అన్నారు. శనివారం ఆయలంలో ఆయన పూజలు చేశారు. అనంతరం భజన బృందం ఆలపించిన భక్తి గీతాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

లోక్ అదాలత్‌తో కేసులు పరిష్కారం

బోథ్, సెప్టెంబర్ 28 : బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 172 కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారమయ్యాయని జడ్జి బీ హుస్సేన్ తెలిపారు. బ్యాంకు అదాలత్ ద్వారా రూ.46,84,000 రికవరీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీపీ శ్రీధర్, ఏజీపీ పంద్రం శంకర్, న్యాయవాదులు అంగద్ రూపేందర్ సింగ్, హరీశ్, విజయ్, జమీర్, రాములు, దమ్మాపాల్, ఎస్ఐ ప్రవీణ్, బ్యాంకు అధికారులు, పోలీస్ స్టేషన్ల కోర్టు పీసీలు పాల్గొన్నారు.

ఉట్నూర్, సెప్టెంబర్ 28: కేసుల సత్వర పరిష్కరానికే లోక్ అదాలత్ నిర్వహించినట్లు ఉట్నూర్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మౌనిక అన్నారు. శనివారం ఉట్నూర్‌లోని కోర్టులో లోక్ అదాలత్ ద్వారా 268 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

భైంసా, సెప్టెంబర్ 28 : రాజీతోనే రాజమార్గమని భైంసా న్యాయమూర్తి దేవేంద్ర బాబు అన్నారు. శనివారం భైంస